




సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

బుధవారం 21-5-2025

సంపుటి: 21 సంచిక: 49
పేజీలు: 8 వెల: రూ.1




## నమ్మిన తుపాకీ తూటాకే..

# నేలకూలిన నంబాల




రెడ్‌జోన్‌లో ఉన్న నంబాల కేశవరావు సొంతూరు జియన్నపేట



జియన్నపేటలో కేశవరావు బాల్యంలో గడిపిన ఇల్లు

- నారాయణపూర్ ఎన్‌కౌంటర్‌లో కేశవరావు మృతి
- సామాన్య కుటుంబం నుంచి విప్లవోద్యమ అగ్రనేత స్థాయికి
- దశాబ్దాలుగా సాయుధ పోరాటమే ఊపిరిగా అజ్ఞాత జీవనం
- స్వగ్రామం జియన్నపేటలో విషాదఛాయలు
- ఆయన జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటున్న గ్రామస్తులు

డి.వి.రమణ, సత్యం ప్రత్యేక ప్రతినిధి

మావోయిస్టు ఉద్యమానికి మరో పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్‌లో భాగంగా గత కొన్నాళ్లుగా దండకారణ్య ప్రాంతాన్ని జల్లెడ పడుతూ వందల సంఖ్యలో మావోయిస్టులను మట్టుబెట్టిన సాయుధ భద్రతా బలగాలు తాజాగా ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్ అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరో 28 మావోయిస్టులను అంతమొందించాయి. ఈ ఎదురు కాల్పుల్లో సీపీఐఎంఎల్ మావోయిస్ట్ పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి, అగ్రనేతల్లో ఒకరైన నంబాల కేశవరావు (70) అలియాస్ బసవరాజు అలియాస్ గంగన్న కూడా హతమయ్యారు. శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలం జియన్నపేటకు చెందిన కేశవరావు తొలుత కమ్యూనిస్టు ఉద్యమం ద్వారా రాజకీయాల్లోకి ప్రవేశించి.. అనంతరం విప్లవోద్యమం వైపు ఆకర్షితుడై జీవితాంతం ఆ ఉద్యమానికే అంకితమయ్యారు. దశాబ్దాల విప్లవోద్యమ జీవితంలో కిందిస్థాయి కార్యకర్త నుంచి అగ్రనేత వరకు ఎదిగారు. నాటి పీపుల్స్‌వార్ నుంచి నేటి మావోయిస్టు పార్టీ వరకు వాటి ఉద్యమాల నిర్మాణంలో, దాడుల్లో సూత్రధారిగా వ్యవహరించారు.

### విద్యార్థి దశ నుంచే వామపక్ష భావజాలం

కోటబొమ్మాళి మండలం జియన్నపేటలో సామాన్య కుటుంబంలో 1955లో కేశవరావు జన్మించారు. అయన తండ్రి వాసుదేవరావు ఉపాధ్యాయుడిగా పని చేసేవారు. తల్లి వరలక్ష్మి, ఏకైక సోదరుడు ఢిల్లీరావు మంచి కబడ్డీ క్రీడాకారుడిగా పేరొందిన కేశవరావు విదార్థిగా ఉన్నప్పుడే వామపక్ష భావజాలాన్ని ఒంటబట్టించుకుని సీపీఐ(ఎం) విద్యార్థి విభాగం ద్వారా రాజకీయాల్లోకి వచ్చి చురుకైన పాత్ర పోషించారు. ప్రాథమిక విద్యాభ్యాసం అనంతరం వరంగల్ వెళ్లి అక్కడి రీజనల్ ఇంజినీరింగ్ కళాశాల(ఆర్ఈసీ)లో బీటెక్ అనంతరం ఎంటెక్ చేస్తుండగా 1970లో విప్లవ రాజకీయాల్లోకి వెళ్లిపోయారు. పెళ్లి చేసుకోకుండా ఆజన్మ బ్రహ్మచారిగా ఉన్న కేశవరావు కుటుంబీకులెవరూ ప్రస్తుతం ఆ గ్రామంలో లేరు. తల్లిదండ్రులు మరణించగా, పోర్ట్ బ్లెయిర్ పోర్టు ఛైర్మన్‌గా పని చేసి రిటైరైన ఏకైక సోదరుడు ఢిల్లీరావు వేరేచోట ఉంటున్నారు. నక్సలిజంలోకి వెళ్లిన తర్వాత కేశవరావు స్వగ్రామానికి ఒక్క సారి కూడా రాలేదంటున్నారు. అయినా ఆయన మరణవార్త తెలియగానే గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

### మావోయిస్టు మిలటరీ వ్యవస్థాపకుడు

ఇంటెలిజెన్స్ వర్గాల సమాచారం ప్రకారం కేశవరావు గెరిల్లా యుద్ధతంత్రంలోనూ, ఐఈడీ(ఇంప్రూవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైజెస్) వంటి పేలుడు పదార్థాల తయారీలోనూ నిపుణుడు. తూర్పు గోదావరి, విశాఖలో మావోయిస్టు పార్టీలో పని చేశారు. మొదట సీపీఐఎం పీపుల్స్‌వార్ గ్రూపు కేంద్ర కమిటీ సభ్యుడిగా కీలకపాత్ర పోషించిన ఆయన 2004లో పీపుల్‌వార్, మావోయిస్టు కమ్యూనిస్ట్ సెంటర్ (ఎంసీసీ) విలీనం తర్వాత సీపీఐ మావోయిస్టు పార్టీ వ్యవస్థాపకుల్లో ఒకరిగా ఉన్న ఆయన ఆ పార్టీలో అంతర్గతంగా సెంట్రల్ మిలటరీ కమిషన్‌ను ఏర్పాటు చేసి దాని అధ్యక్షుడిగా వ్యవహరించారు. మల్లోజుల కోటేశ్వర రావు అలియాస్ కిషన్‌జీ, మల్లోజుల - మిగతా చివరి పేజీలో

---

## ఈసురోమని రోడ్డులుంటే..

# పల్లెలేగతి బాగుపడునోయ్?!

- పల్లెపండుగలోనూ ప్రారంభంకాని రహదారులు
- పీఆర్ పరిధిలోనే ఎక్కువ పెండింగ్‌లు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

పల్లె పండగతో గ్రామీణ రోడ్లకు మహర్దశ అంటూ డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ చేసిన వాగ్దానం ప్రకటనలకే పరిమితమైంది. ఉపాధి హామీ పథకంలో మెటీరియల్ కాంపొనెంట్ ద్వారా సీసీ, బీటీ రోడ్డులు నిర్మాణానికి పల్లెపండగ కార్యక్రమంలో అధిక ప్రాధాన్యం ఇచ్చారు. ప్రాధాన్యత క్రమంలో పనులు గుర్తించి కొన్నింటిని పూర్తిచేశారు. మరికొన్నింటిని మధ్యలోనే నిలిపేశారు. ఇంకొన్నింటి జోలికే వెళ్లలేదు. స్థానిక కూటమి పార్టీల ఎమ్మెల్యే సిఫార్సు మేరకు పల్లెపండగ పనులను పంచాయతీ రాజ్, ఆర్ అండ్ బి అధికారుల ఆధ్వర్యంలో ఉపాధి హామీ సిబ్బంది దగ్గరుండి చేయించారు. పల్లె పండగలో గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లన్నింటిని బీటీ, సీసీ రోడ్లుగా మార్చుతారని సంబరపడిన గ్రామీణ ప్రాంతాల ప్రజల ఆశలు నెరవేరలేదు. పంచాయతీరాజ్ పరిధిలో 5,644 సీసీ, బీటీ రోడ్డులు, ఆర్ అండ్ బి పరిధిలో 41 బీటీ రోడ్లకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. అందులో పంచాయతీరాజ్ పరిధిలో 3,551 సీసీ, బీటీ రోడ్లు ప్రారంభించగా, 2,219 సీసీ, బీటీ రోడ్లు పూర్తి చేశారు. ఆర్ అండ్ బి పరిధిలో 41 బీటీ రోడ్లకుగాను 37 ప్రారంభించి కొంతమేర పూర్తిచేశారు. అయితే కొన్ని గ్రామీణ ప్రాంత రోడ్లను స్థానిక ఎమ్మెల్యేలు, అధికారులు పరిగణలోకి తీసుకోలేదు. ఆ రోడ్లు శిథిలావస్థకు చేరి అధ్వాన్నంగా తయారైనా కూటమి నాయకులు వాటిపై దృష్టిపెట్టలేదు. జిల్లాలో ఇలాంటి రోడ్లు పదుల సంఖ్యలో ఉన్నా, వాటిని ప్రాధాన్యత గుర్తించలేదు. దీంతో ఆ ప్రాంతాలకు చెందిన ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వైకాపా ఐదేళ్ల పాలనలో గ్రామీణ ప్రాంతాల రోడ్లను ప్రభుత్వం పట్టించుకోలేదు. తట్టెడు మట్టి వేయలేదు. కూటమి ప్రభుత్వం హయాంలోనైనా రోడ్లు మరమ్మతులకు నోచుకుంటాయని ఎదురు చూసినా ఆ ప్రయత్నాలు ఫలించడం లేదని గ్రామీణ ప్రాంతాల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కొందరైతే వివక్ష చూపుతున్నారని కూటమి ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తున్నారు.

శ్రీకాకుళం, ఆమదాలవలస నియోజకవర్గం పరిధిలో దూసి రోడ్డు నుంచి వంజంగి వరకు పంచాయతీరాజ్ పరిధిలో బీటీ రోడ్డును 2005లో మాజీ మంత్రి ధర్మాన హయాంలో నిర్మించారు. 2004 ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ధర్మాన ఎన్నికైన ఏడాదిలోగా దూసి రోడ్డు నుంచి రాగోలుపేట మీదుగా ఏడు గ్రామాలను కలుపుతూ వంజింగి (ఆమదాలవలస రోడ్డు) వరకు సుమారు 3 కిలోమీటర్లు బీటీ రోడ్డు వేశారు. 20 ఏళ్ల క్రితం వేసిన బీటీ రోడ్డుపై ఇప్పటి వరకు తట్టెడు మట్టి వేయలేదు. మరమ్మతులు చేపట్టలేదు. ఆయా గ్రామాల పరిధిలో శ్రమదానం చేసి రోడ్డుపై గంతలు కప్పే ప్రయత్నం ఆయా గ్రామాలకు చెందిన యువత చేశారు. ఈ రోడ్డు ఆమదాలవలస నియోజకవర్గం పరిధిలో వంజింగి, సువ్వారిపేట, గుట్టుముడిపేట ఉన్నాయి. శ్రీకాకుళం పరిధిలో రాగోలు పంచాయతీకి చెందిన రాగోలుపేట, బావాజీపేట, సెగిడిపేట, ఎస్సీ కాలనీ ఉన్నాయి. సుమారు 5వేలు జనాభా కలిగిన ఈ ఏడు గ్రామాలు నుంచి నిత్యం ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాల రాకపోకలు సాగిస్తుంటారు. వ్యవసాయ పనుల, నిర్మాణ తదితర అవసరాలకు ట్రాక్టర్లు రాకపోకలు సాగిస్తాయి. అయినా ఆ రోడ్డు మరమ్మతులకు నోచుకోవడంలేదు. 2014లో ఆమదాలవలస ఎమ్మెల్యేగా కూన రవికుమార్ ఆయన నియోజకవర్గం పరిధిలో వంజంగి నుంచి గట్టుముడిపేట వరకు సుమారు 1.5 కిలోమీటర్లు బీటీ రోడ్డు మరమ్మతు పనులు చేశారు. ఆ సమయంలో మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవికి శ్రీకాకుళం నియోజకవర్గం పరిధిలో మిగతా 1.5 కిలోమీటర్ల పనులకు నిధులు మంజూరు చేయించాలని కోరినా సాధ్యం కాలేదని స్థానికులు చెబుతున్నారు. దీంతో 3 కిలోమీటర్ల రోడ్డులో 1.5 కిలోమీటర్లు రోడ్డు మాత్రమే మరమ్మతులు చేసి శ్రీకాకుళం నియోజకవర్గం పరిధిలో విడిచి పెట్టేశారు. మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి 2018లో ప్రతిపక్ష నేతగా చేసిన ప్రజాసంకల్పయాత్ర పాదయాత్రను ఈ రోడ్డు మీదుగానే చేశారు. ఆ సమయంలో ఈ రోడ్డుపై గుంతల్లో మట్టి వేసి చదును చేశారు. ఆ తర్వాత వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా రోడ్డు మరమ్మతులకు నోచుకోలేదు.





కూటమి పార్టీలు సార్వత్రిక ఎన్నికల సమయంలో గ్రామీణ రోడ్ల దుస్థితిని హైలెట్ చేసి ఓట్లు దండుకున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామీణ రోడ్లు బాగుపడతాయిని ప్రజలు అంచనా వేసినా, ఆ స్థాయిలో ప్రాధాన్యత క్రమంలో రోడ్డు పనులు చేయలేదని ఆరోపణలు ఉన్నాయి. ఆర్ అండ్ బి పరిధిలో రూ.6.22 కోట్లు అంచనా వ్యయంతో 41 బీటీ రోడ్డు పనులు ప్రారంభించినా బిల్లుల చెల్లింపులు జరగలేదు. గత ఏడాది నవంబర్‌లో కేవలం రూ.1.04 కోట్లు మాత్రమే బిల్లులు జమ చేసి ఆరు నెలలుగా ఒక్క పైసా జమ చేయలేదు. దీంతో బీటీ రోడ్డు పనులు సగంలోనే నిలిచిపోయాయి. ఆ కోవలోనే దూసి రోడ్డు నుంచి వంజంగి వరకు సుమారు 3 కిలోమీటర్లు బీటీ రోడ్డు మంజూరుకే నోచుకోలేదు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్ రోడ్డు దుస్థితిని స్వయంగా పరిశీలించి స్థానిక ప్రజల అవస్థలను గుర్తించి రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని బాధిత గ్రామాల ప్రజలు కోరుతున్నారు. చిన్నపాటి వర్షానికే రోడ్లు చెరువును తలపిస్తున్నాయి. వర్షాకాలంలో రోడ్డు మధ్యలో గుంతల్లో నీరు చేరి మురుగు కాలువల్లా మారిపోతున్నాయి. దీంతో బావాజీపేటలో ఈ పరిస్థితి మరీ దారుణంగా ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతూ అనారోగ్యం పాలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే స్పందించి రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని బావాజీపేట, రాగోలుపేట, సెగిడిపేట, ఎస్సీ కాలనీ ప్రజలు కోరుతున్నారు.


JMR Veg. & Non-Veg Restaurant
Flavours
కార్ పార్కింగ్ సదుపాయం కలదు




## ఘనంగా ధర్మాన జన్మదిన వేడుకలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

మాజీమంత్రి ధర్మాన ప్రసాదరావు జన్మదిన వేడుకలు ఒడిశా తీరం గోపాల్‌పూర్ వద్ద ఆయన అభిమానులు నిరాడంబరంగా బుధవారం నిర్వహించారు. జిల్లా వైకాపా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ కేక్ కట్ చేసి ధర్మాన ప్రసాదరావుకు తినిపించారు. ఈ వేడుకల్లో ధర్మాన సతీమణి గజలక్ష్మి, సోదరుడు ధర్మాన రామ్‌దాస్‌తో పాటు వైకాపా నేతలు అంధవరపు సూరిబాబు, పేరాడ తిలక్, చింతాడ రవి, కోణార్క్ శ్రీను, ఎం.వి.స్వరూప్, మూకళ్ల తాతబాబు, గేదెల పురుషోత్తం, అంబటి శ్రీను, మామిడి శ్రీకాంత్, తంగుడు జోగారావు, చల్లా శ్రీను, అంధవరపు కొండబాబు, దుంగ సుధాకర్, మండవిల్లి రవి, శిమ్మ రాజశేఖర్, సీపాన మహీంద్ర తదితరులు పాల్గొన్నారు.



• ఎడిటోరియల్

# రాష్ట్రపతికి 'సుప్రీం' నిర్దేశంలో తప్పేముంది?

అత్యున్నత రాజ్యాంగ వ్యవస్థల మధ్య సంఘర్షణ అవాంఛనీయం. ఒకవేళ అలాంటి పరిస్థితే తలెత్తితే దాన్ని నివారించడానికి మిగతా రాజ్యాంగ వ్యవస్థలు కృషి చేయాలి. కానీ దురదృష్టవశాత్తు ప్రస్తుతం అలా జరగడంలేదు. రాజ్యాంగ అనిశ్చితికి కారణమవుతున్న ఒక సుదీర్ఘకాలం వివాదంపై దేశ సర్వోన్నత న్యాయస్థానం స్పష్టమైన ఆదేశాలు ఇస్తే దాని అమలుకు కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకోకుండా.. దానికి భిన్నంగా వ్యవహరిస్తోంది. గవర్నర్ల పాత్రపై ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను రాష్ట్రపతి ప్రశ్నించడం కొత్త వివాదానికి తెరలేపింది. అసలు అలా తీర్పు ఇచ్చే అధికారం సర్వోన్నత న్యాయస్థానానికి ఉందో లేదో తేల్చమని సుప్రీంకోర్టుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పద్నాలుగు ప్రశ్నలు సంధించారు. పేరుకు రాష్ట్రపతి వీటిని సంధించినా ఈ వ్యవహారం మొత్తం కేంద్రం కనుసన్నల్లోనే జరిగిందనేది బహిరంగ రహస్యం. గవర్నర్ల వ్యవహారశైలిని తప్పుపడుతూ గత నెలలో సుప్రీంకోర్టు తీర్పునకు విరుగుడు ఏమిటన్నదానిపై కేంద్రం మంతనాలు ప్రారంభించింది. అటార్నీ జనరల్, సోలిసిటర్ జనరల్, ఇంకా న్యాయశాఖ ప్రతినిధులతో విస్తృత చర్చలు జరిపి చివరికి రాష్ట్రపతి ద్వారానే సుప్రీంకోర్టును ప్రశ్నించాలని నిర్ణయించుకుని, ఆ మేరకు ప్రశ్నావళిని రూపొందించి రాష్ట్రపతి భవన్‌కు అందజేసింది. దానికిముందు ఈ తీర్పుపై సమీక్ష కోరాలా లేక మరింత విస్తృత ధర్మాసనం ద్వారా రివ్యూ కోరాలా అని తర్జనభర్జనలు పడింది. చివరికి రాజ్యాంగంలోని 143(1) అధికరణం కింద రాష్ట్రపతి పేరిట సలహా కోరడమే మంచిదన్న నిర్ణయానికి వచ్చింది. ఎందుకంటే రాష్ట్రపతి ఏవైనా సందేహాలు లేవనెత్తితే వాటిపై చర్చించేందుకు ఐదుగురు సభ్యుల ధర్మాసనం ఏర్పాటు చేయటం పరిపాటి. గతంలో ఇలా కోరిన సందర్భాలు ఉన్నాయి. 1960లో సి జాబితాలోని రాష్ట్రాల ప్రతిపత్తిపై కేంద్రం 'సుప్రీం' సూచనలు కోరింది. ప్రాదేశిక భూభాగంపై పాకిస్తాన్‌తో ఒప్పందం చేసుకోవచ్చా అంటూ 1951లో, ఎమర్జెన్సీ తర్వాత ఆనాటి అత్యాచార కేసుల విచారణకు ప్రత్యేక న్యాయస్థానాలు ఏర్పాటు చేయవచ్చునా? అన్న అంటూ 1978లో కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టు సూచనలు కోరింది. వీటిపై సూచనలు ఇవ్వడం, ఇవ్వకపోవడమన్నది సుప్రీం ఇష్టం. కాకపోతే ప్రస్తుతం రాష్ట్రపతి పంపిన ప్రశ్నావళి రాజ్యాంగ నిబంధనల అనువర్తింపునకే కాకుండా రాజకీయ సంఘర్షణ, రాజ్యాంగ ప్రతిష్టంభనకూ దారితీసే ప్రమాదం ఉంది. తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి ఆ రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించిన పది బిల్లులను ఆమోదించకుండా చాలాకాలంగా తన వద్దే అట్టి పెట్టుకు వివాదంపై సుప్రీంకోర్టు విచారించింది. తన వద్దకు వచ్చే బిల్లులను మూడు నెలల్లోగా ఆమోదం లేదా తిరస్కరణ చేయాల్సి ఉంటుందని తేల్చిచెప్పింది. రాష్ట్రపతి పరిశీలనకు పంపితే అప్పుడు కూడా మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలని నిర్దేశించింది. దాంతో రాష్ట్రపతికి సుప్రీంకోర్టు ఎలా ఆదేశాలిస్తుందని చాలా మంది అభ్యంతరాలు లేవనెత్తారు. ఇప్పుడు రాష్ట్రపతి చేసిన 143(1) ప్రస్తావన కూడా అలాంటి ప్రశ్నలనే లేవనెత్తింది. వాస్తవానికి చాలామంది వాదిస్తున్నట్టు ఇక్కడ సుప్రీంకోర్టు.. రాష్ట్రపతి లేదా గవర్నర్ల నిర్ణయాధికారంపై ఎటువంటి ఆదేశాలు ఇవ్వలేదు. తమకు నచ్చిన నిర్ణయం తీసుకోవడానికి కాలవ్యవధి మాత్రమే నిర్దేశించింది. ఇది కూడా ఇందిరాగాంధీ హయాంలో సర్కారియా కమిషన్, వాజ్‌పేయి హయాంలో పూంఛ్ కమిషన్లకు నేతృత్వం వహించిన మాజీ న్యాయమూర్తులు చెప్పిందే. గతంలో రెండుమూడు సందర్భాల్లో అత్యున్నత న్యాయస్థానం ఇంతకంటే సూటిగా రాష్ట్రపతి విధి విధానాలను నిర్దేశించింది. ఎస్ఆర్ బొమ్మై కేసులో రాష్ట్ర ప్రభుత్వాల రద్దు, రాష్ట్రపతి పాలన విధింపు విషయంలో జరిగిన ఏకపక్ష పోకడలకు 1994లో సుప్రీంకోర్టు అడ్డుకట్ట వేసింది. మరణ శిక్ష పడిన ఖైదీల క్షమాభిక్ష దరఖాస్తులపై నిర్ణయం తీసుకోవడానికి కూడా గడువును సుప్రీంకోర్టు నిర్దేశించింది. అప్పుడెప్పుడూ లేని అభ్యంతరం ఇప్పుడే ఎందుకొచ్చినట్టు? పైగా సుప్రీంకోర్టుకు రాష్ట్రపతి ప్రశ్నావళి పంపడానికి ముందే ఉపరాష్ట్రపతి జగదీప్ దన్‌కర్ సుప్రీంకోర్టుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఆయన మాటలు కేంద్రం వైఖరికి ప్రతిధ్వనులేనని ఇప్పుడు అర్థమవుతున్నది. మోడీ హయాంలో అనేక రాష్ట్రాల్లో నియమితులైన గవర్నర్లు అత్యుత్సాహంతో ప్రత్యక్ష రాజకీయ పాత్ర పోషిస్తూ బీజేపీయేతర ప్రభుత్వాలను ముప్పుతిప్పలు పెడుతున్నారు. రాజ్యాంగ వ్యవస్థలైన అసెంబ్లీలు తీర్మానించిన బిల్లులు గవర్నర్ల వద్ద మగ్గిపోతున్నాయి. మరి ఆ రాజ్యాంగ వ్యవస్థల అధికారాన్ని కాపాడాలంటే.. సుప్రీంకోర్టు వంటి వ్యవస్థలు గట్టిగా వ్యవహరించాల్సిందే కదా!

# తూనికలు కొలతలపై అవగాహన సదస్సు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళం పొట్టి శ్రీరాములు మార్కెట్ లో గల శ్రీరామ మందిరములో బుధవారం లీగల్ మెట్రాలజీ డే సంద ర్భంగా తూనికలు కొలతలు అధికారుల సమక్షంలో వ్యాపారస్తులు అందరకీ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇన్ స్పెక్టర్ కె.రాజారమేష్ మాట్లాడుతూ ప్రతి వస్తువుపై ఎమ్మార్పీ రేటు తప్పకుండా ఉండాలన్నారు. రేటు ఎక్కువగా అమ్మినట్లు తెలియజేస్తే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ముఖ్యంగా రైస్‌ప్యాకెట్ ఇరవైఆరు కేజీలు వుండాలని, చాలా షాపుల్లో దానికి బదులుగా ఇరవైఐదు కేజీలు తూని కలలో ప్యాకింగ్ చేసి అమ్ముతున్నారని అటువంటి వారి పై చట్టపరమైన చర్యలతోపాటు ఇరవైఐదువేల రూపాయలు జరిమానా విధిస్తామని తెలిపారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు నూతన చట్టాల కోసం వాటి విధి విధానాలు కోసం అనేక అవగాహన సదస్సులను నిర్వహిస్తుందన్నారు. వ్యాపారస్తులు అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎక్కడైనా సమస్యలు వస్తే అధికారులు దృష్టికి తెలియజేయాలన్నారు. కొన్ని సందర్భాల్లో జాయింట్ కలెక్టర్ అనుమతితో కేసులను కోర్టుకు సమర్పించే అవకాశం ఉందన్నారు. అంతే కాకుండా చాలా మంది ఇంటి దగ్గర సొంతంగా కొన్ని ఐటమ్స్ తయారుచేసి ప్యాకింగ్ చేసి అమ్ముతున్నారని అటువంటి వాళ్ళు కూడా లైసెన్స్ తీసుకొని వస్తువులను తయారు చేయాలన్నారు. అలా చేయని యెడల వివరాలు తెలియజేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఏసీ ఎల్.ఎం. శంకర్, విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



స్థానిక పెదపాడు గ్రామంలో వెలసిన శ్రీశ్రీశ్రీ అప్పన్నమ్మ తల్లి గుడి ముఖద్వా రంను ఎమ్మెల్యే గొండు శంకర్ బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో పెదపాడు గ్రామ పంచాయతీ ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

– సత్యంన్యూస్, శ్రీకాకుళం

# 22న హనుమాన్ శోభాయాత్ర

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

హనుమజ్జయంతి మహాపర్వదినం సందర్భంగా విశ్వ హిందూపరిషత్ భజరంగదళ్ ఈనెల 22న శ్రీకాకుళం పట్టణంలో భక్తిసంద్రముప్పొంగేలా హైందవచైతన్యం వెల్లి విరిసేలా హనుమాన్ శోభాయాత్రను నిర్వహించనున్నట్లు విశ్వ హిందూ పరిషత్ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు లోక నాథం ఆనందరావు తెలిపారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం భజరంగ్ దళ్ జిల్లా అధ్యక్షులు కొయ్యన కిరణ్ మాట్లాడుతూ ఆనాడు ధర్మాన్ని రక్షించడంకోసం దుష్టసంహారం చేయడంకోసం తన జీవితాన్ని సర్వస్వం సమర్పణ చేసిన హనుమ జీవితం ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు. అటువంటి వీరహనుమాన్ జయంతి రోజున శ్రీకాకుళం పట్టణంలో శోభాయాత్ర (భారీ బైక్‌ర్యాలీ) హిందూ బంధువులు పాల్గొని హనుమాన్ శోభయాత్రని జయప్రదం చేయాలని కోరారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శ్రీకాకుళం జిల్లా సంఘ చాలక్ పి.వి.రమణ మూర్తి మాట్లాడుతూ ఈ వీర హనుమాన్ శోభయాత్రలో అంజనేయస్వామి విగ్రహాన్ని ఏర్పాటుచేసి భజనబృందాలతో కోలాటాలతో భక్తబృందాలతో వైభవంగా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీరంగం మధుసూదన్‌రావు, ప్రాంత భజరంగ్‌దళ్ సంయోజక్ రావాడ రాజశేఖర్, నగర సంయోజక్ బోడిగి మధు, జిల్లా గోరక్ష ప్రముఖ్ మెట్ట శ్రీనివాస్, ఏబీవీపీ జిల్లా కన్వీనర్ బోర గోపి మరియు భజరంగ్ దళ్ కార్యకర్తలు పాల్గొన్నారు.



# మెరిసిన బాడీ బిల్డింగ్ పోటీలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

స్థానిక అంబేద్కర్ ఆడిటోరియంలో మంగళవారం సాయంత్రం జోనల్ బాడీబిల్డింగ్ పోటీలు ఘనంగా జరిగాయి. స్టార్ బాడీబిల్డర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో ఆరు జిల్లాల నుంచి 100మంది పాల్గొన్నారు. ఈ పోటీల్లో జూనియర్ కేటగిరిలో చాంపియన్ ఆఫ్ ది ఛాంపియన్‌గా జి.హేమంత్‌కుమార్, విశాఖ సెకండ్ ఛాంపియన్‌గా సాయి విశాఖ, జూనియర్ క్లాసులో ఎం రోహిత్ నిలిచారు. ఈ సందర్భంగా స్టార్ బాడీ బిల్డర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వి విజయకుమార్ వివరాలను వెల్లడించారు. విజేతలకు ఎస్సై, ఆర్.సంతోష్, రాయితీ చంద్రశేఖర్‌లు బహుమతులు, నగదు పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో ది ఆంధ్ర బాడీ బిల్డర్స్ అసోసియేషన్ వాడపల్లి శ్రీనివాస్ రాజు, ఈశ్వర్, బాబి, కోటిరెడ్డి, అశోక్ కుమార్, చినబాబు, రాజారావు, కోటేశ్వరరావు, బి.సూరిబాబు నాగు తదితరులు పాల్గొన్నారు.



# 'మాటామంతీ'కి రావివలస పైలట్ ప్రాజెక్ట్

(సత్యంన్యూస్, టెక్కలి)



మాటామంతీ కార్యక్రమానికి పైలట్ ప్రాజెక్ట్‌గా టెక్కలి నియోజకవర్గం రావివలస గ్రామాన్ని ఎంపిక చేసినట్లు వ్యవసాయ శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. ఈమేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 22న రావివలస గ్రామస్థులతో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వర్చువల్ విధానంలో మాట్లాడతారన్నారు. టెంపుల్ టూరిజం, గ్రామాభివృద్ధి ధ్యేయం కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. ఈ ఎంపికతో గ్రామ రూపురేఖలు మారనున్నాయన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 175 నియోజకవర్గాలు ఉండగా వీటిలో శ్రీకాకుళం జిల్లా టెక్కలి నియోజకవర్గం రావివలస గ్రామాన్ని ఎంపిక చేయడం విశేషమన్నారు. గ్రామంలో గల ఎండల మల్లికార్జున స్వామి ఆలయ అభివృద్ధి టెంపుల్ టూరిజాన్ని అభివృద్ధి చేయనున్నారన్నారు.



ఒక వ్యక్తి జీవితంలో సక్సెస్ కావడానికి వెనుక ఎంతో కృషి ఉంటుందో అదేస్థాయిలో కష్టాలు, కన్నీళ్లు కూడా ఉంటాయి.. తాను వెళ్లే బాటలో పూలు ఉంటాయి.. ముళ్లు ఉంటాయి.. అనుకున్నవి జరగవు.. అనుకోని అవరోధాలు ఎదురవుతాయి.. కుంగిపోకూడదు.. జీవితం ఎప్పుడూ మనిషికి మరో ఛాన్స్ ఇస్తూనే ఉంటుంది.. దానిని కనిపెట్టడంలోనే మనిషి ఎదుగుదల ఉంటుంది. అది నిత్య జీవితానికైనా.. సినీ జీవితానికైనా ఒకటే.. ఇప్పుడు మనకు తెలిసిన పూరీ జగన్నాథ్ ఈ స్థాయిలో ఉండడానికి ముందు ఎన్ని కష్టాలు పడ్డారో.. ఎటువంటి ఇబ్బందులను ఎదుర్కొన్నారో తెలుసా... తాను మొదట దర్శకత్వం వహించాల్సిన సినిమా ప్రారంభోత్సవానికి వెళ్లి మరీ ఆగిపోయిందని మీకు తెలుసా.. ఆ తరువాత ఆయన ఎంత మధనపడ్డారో కదా.. ఆయన పరిస్థితిని అర్థం చేసుకున్న ఒక సినీనటి పూరీకి తన మాటలతో ఎంతటి ధైర్యం నూరిపోశారో మీకు తెలుసా.. ఆమె మాటలతో స్ఫూర్తి పొందిన పూరీ ఎలా సక్సెస్ అయ్యారో తెలుసా.. తన జీవితంలో సక్సెస్‌లు రావచ్చు. ఫెయిల్యూర్స్ రావచ్చు.. కానీ పూరీ అంటేనే ఎప్పటికీ పడి లేచిన కెరటం!!

# పూరీ అంటేనే.. పడి లేచిన కెరటం!




కృష్ణానగర్ లోని ఆర్టిస్ట్ పొట్టి వీరయ్య గారి ఎస్టీడీ బూత్‌కి ఫోన్ వచ్చింది, అక్కడ పూరీ జగన్నాథ్ అనే అబ్బాయి ఉన్నాడా అండి అని అవతలి వ్యక్తి అడిగాడు. ఆ ఎస్టీడీ బూత్ ఎదురుగా ఉన్న ఇంటిపైన బ్యాచిలర్స్ రూంలో పూరీ అనే కొత్త కుర్రాడొచ్చి నెలన్నర అయ్యింది.

కొత్త కొత్త యాక్టర్లకు డైరెక్టర్లకు అడ్డా అప్పట్లో.. ఈ ఎస్టీడీ బూత్, అన్నట్టు చెప్పడం మర్చిపోయాను గురూజీ ఆ ఫోన్ చేసింది నిర్మాత ఐబీకే మోహన్. వైజాగ్‌కు చెందిన ఈ ఐబీకే మోహన్ అనే ప్రొడ్యూసర్‌కు పూరీ జగన్నాథ్ కథ చెప్పి నాలుగు నెలలైంది. కథ ఓకే అయ్యింది. టైటిల్ రిజిస్టర్ చేయించడం కోసం ఆయన పూరీ జగన్నాథ్ ఇచ్చిన ఈ ఎస్టీడీ బూత్ నెంబర్‌కు ఫోన్ చేశాడు.

మేడపైన రూంలో ఉన్న పూరీకి ఫోన్ వచ్చిందన్న కబురు అందింది, పరుగు పరుగున వచ్చి ఫోన్ తీసుకుని మాట్లాడుతున్నాడు. అప్పుడప్పుడే ముత్తు సినిమా వచ్చి పెద్ద ప్రభంజనం సృష్టిస్తోంది. అందులో థిల్లాన థిల్లాన నా కసి కళ్ళ కూన పాట వైరల్ అయిపోయింది. మరోమాట లేకుండా మన టైటిల్ "థిల్లాన" అనేశాడు. వెరైటీ టైటిల్స్ పెట్టడం అప్పట్నుంచే మొదలైందో ఏమోగానీ ఆ తరువాత పూరి టైటిల్స్ అన్నీ చాలా క్యాచీగా, డిఫరెంట్‌గా ఉన్నాయి, థిల్లాన అనే ఒక టైటిల్‌తో సినిమా ఉందని చాలామందికి తెలియదు. రౌడీ అన్నయ్య, నెంబర్ వన్, అమ్మ దొంగా, తెలుగు వీర లేవరా లాంటి సినిమాలతో దూసుకుపోతున్నారు సూపర్‌స్టార్ కృష్ణ, సెకండ్ ఇన్నింగ్స్ అనాలో కొత్త హీరో వచ్చాడనాలో సంప్రదాయం సినిమా హిట్టు యమలీలలో స్పెషల్ సాంగ్, వారసుడు, రాముడొచ్చాడులో స్పెషల్ క్యారెక్టర్లు కృష్ణ గారి శకం మళ్ళీ మొదలైన టైం అది...

కృష్ణ గారి గురించి గొప్పగా చెప్పడం అని కాదు గానీ ఆ టైంలో ఏ పెద్ద హీరోకు ఈ కథ చెప్పినా అనుభవం లేని కారణంగా రిజెక్ట్ చేసేవారు కానీ అసలు ఏమాత్రం అనుభవం లేని కొత్త దర్శకులకు కూడా పిలిచి మరీ అవకాశం ఇచ్చే రికార్డు ఉంది కృష్ణ గారికి, పూరీ చెప్పిన కథ ఆయనకు నచ్చింది. పూరీ సంతోషానికి హద్దుల్లేవు, డైరెక్టర్ అవ్వాలన్న తన కల ఇంత తొందరగా నిజం అవుతుందని అనుకోలేదు, అయితే ఆ ఆనందం ఎక్కువరోజులు లేదు. 1996లో క్లాప్ కొట్టి, మూడు రోజుల ఫస్ట్ షెడ్యూల్ తరువాత సినిమా ఆగిపోయింది. దానికి కారణం అంతకుముందు సంవత్సరంలో ఐబీకే మోహన్ శోభన్‌బాబు గారితో దొరబాబు సినిమా తీశాడు, అది ఫ్లాప్ అవ్వడంతో ఫైనాన్షియల్ ప్రాబ్లెమ్స్ వల్ల సినిమా ఆగిపోయింది.

దొరబాబు సినిమా ప్రసన్నాంజనేయ ఫిలింస్ బ్యానర్ మీద తీశారు, థిల్లాన వీరాంజ నేయ ఫిలింస్ బ్యానర్ అని పేరు మార్చారు, దొర బాబు సినిమా బాగుంటుంది కానీ సరిగా ఆడలేదు, అందులో ప్రియారామన్ హీరోయిన్. సినిమా ఆగిపోయిందని అఫిషియల్‌గా అనౌన్స్ చేశారు. నాని జెర్సీ సినిమాలో ట్రైన్ సీన్ గుర్తుందా.. గురూజీ అలా ఫిలింనగర్ నుంచి కృష్ణానగర్ వరకూ ఎక్కడా ఒక్కచోట కూడా ఆగకుండా నడుచుకుంటూ వచ్చాడు. ఉదయం నుంచి ఖాళీ కడుపుతో ఉన్నాడో ఏమో టీ తాగి ఆ గాజు గ్లాసులోంచి కృష్ణానగర్ మొత్తం స్కాన్ చేశాడు. ఇక్కడ నాలాంటి వాళ్ళు ఎంతమంది ఉన్నారో అని ఆలోచిస్తూ కూర్చున్నాడు. అటువైపుగా సినిమా వెహికల్ ఒకటి వచ్చి ఆగింది, "కృష్ణ గారితో సినిమా ఆగిపోతే ఏంటి, నువ్వు కృష్ణ కొడుకుతో ఇండస్ట్రీ హిట్ కొడతావేమో ఎవరికి తెలుసు, బాధపడుతూ కూర్చుంటే పనులవ్వవు ఇక్కడ" ఈ మాట చెప్పింది. అప్పటికే పూరీ జగన్నాథ్‌కు పరిచయం ఉన్న సీనియర్ ఆర్టిస్ట్ రమాప్రభ గారు.

సినిమా ఆగిపోయిందని అఫిషియల్‌గా అనౌన్స్ చేశారు. నాని జెర్సీ సినిమాలో ట్రైన్ సీన్ గుర్తుందా.. గురూజీ అలా ఫిలింనగర్ నుంచి కృష్ణానగర్ వరకూ ఎక్కడా ఒక్కచోట కూడా ఆగకుండా నడుచుకుంటూ వచ్చాడు. ఉదయం నుంచి ఖాళీ కడుపుతో ఉన్నాడో ఏమో టీ తాగి ఆ గాజు గ్లాసులోంచి కృష్ణానగర్ మొత్తం స్కాన్ చేశాడు. ఇక్కడ నాలాంటి వాళ్ళు ఎంతమంది ఉన్నారో అని ఆలోచిస్తూ కూర్చున్నాడు. అటువైపుగా సినిమా వెహికల్ ఒకటి వచ్చి ఆగింది, "కృష్ణ గారితో సినిమా ఆగిపోతే ఏంటి, నువ్వు కృష్ణ కొడుకుతో ఇండస్ట్రీ హిట్ కొడతావేమో ఎవరికి తెలుసు, బాధపడుతూ కూర్చుంటే పనులవ్వవు ఇక్కడ" ఈ మాట చెప్పింది. అప్పటికే పూరీ జగన్నాథ్‌కు పరిచయం ఉన్న సీనియర్ ఆర్టిస్ట్ రమాప్రభ గారు.

ఏదో ఒక పాజిటివ్ మాట నోటినుంచి వచ్చిందంతే, ఆమె ఇలా జరుగుతుంది అని ఊహించి చెప్పలేదు కానీ మామూలుగానే కాన్ఫిడెన్స్‌కి కేరాఫ్ అడ్రస్ పూరీ, అసలు పూరీ అంటేనే పడి లేచే కెరటం. కొన్ని వందల సినిమాల్లో నటించిన రమాప్రభ గారు ఆ మాట అనేసరికి పూరీ మరింత ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగిపోయాడు.

డైరెక్టర్ పూరీ జగన్నాథ్ తొలి ప్రయత్నంగా కృష్ణ గారితో మొదలుపెట్టి ఆగిపోయిన థిల్లాన కథనే కాస్త మార్పులు చేర్పులు చేసి మోడ్రన్‌లుక్‌తో పవర్‌స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా తీసిన బద్రి, అంటే బద్రి పవన్ కళ్యాణ్ గారు చేయకపోయి ఉంటే అది కృష్ణ గారి సినిమా అయ్యేది గురూజీ... గమనించారో లేదో రమాప్రభ గారు చాలా క్యాజువల్‌గా అన్న మాటలు నిజం అయ్యాయి. ఆమె ఆ మాట అన్నప్పుడు ఇంకా రాజకుమారుడు సినిమానే రాలేదు. ఇది మరి డెస్టినీనో లేదంటే పూరీ కష్టమో తెలీదు గానీ కొన్ని అద్భుతాలు అలా జరిగిపోతాయి గురూజీ...

తనను ఇంతవాడ్ని చేసిన కృష్ణానగర్‌ను పూరీ గారు మర్చిపోలేదు గురూజీ.. నేనింతే సినిమాలో కృష్ణానగర్ మీద ఒక పాట పెట్టాడు. కృష్ణానగరే మామా కృష్ణానగరే మామా సినిమాలే లైఫ్ రా మామా లైఫ్ అంతా సినిమా మామా...!

**మీరు కూడా ప్రయత్నించండి.. మీలోని దర్శకుడిని బయటకు తీయండి**

- విశ్వ టాకీస్

## ఎండీయు ఆపరేటర్లను తొలగించడం తగదు

**- వారి కుటుంబాలను రోడ్డుకీడ్చవద్దు**
**- తమను తొలగించాలంటే తక్షణమే డిమాండ్లు పరిష్కరించాలి**
**- ఎండీయు ఆపరేటర్ల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు రౌతు సూర్యనారాయణ**

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

నిరంతరం ప్రజాశ్రేయస్సే లక్ష్యంగా పనిచేస్తున్న ఎండీయు ఆపరేటర్లను తొలగించడం తగదని ఎండీయు ఆపరేటర్ల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు రౌతు సూర్యనారాయణ, ట్రేడ్ యూనియన్ జేఏసీ నాయకులు శ్రీకాకుళం జిల్లా గౌరవ అధ్యక్షులు టి తిరుపతిరావు అన్నారు. నగరంలోని ఎన్జీవో హోంలో బుధవారం ఎండీయు ఆపరేటర్ల నిరసన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 9,260 ఎండీయు ఆపరేటర్లు, 9,200 సహాయకులు పనిచేస్తున్నారని తెలిపారు. వీరు విధుల్లో చేరిన సమయంలో 72 నెలల అగ్రిమెంట్ ఉందని, ప్రస్తుతం మరో రెండేళ్ల పాటు విధుల్లో కొనసాగే అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వం రాత్రికిరాత్రికి అనాలోచిత నిర్ణయంతో ఆపరేటర్లను తొలగించడం సమంజసం కాదని తెలిపారు. ఇటువంటి నిర్ణయాల వలన సుమారు 18,500 కుటుంబాలు రోడ్డున పడతామయని ఆవేదన వ్యక్తం చేశారు. కరోనా కష్టకాలంలో కూడా ఒక్కో ఆపరేటర్ 1500 వందల నుంచి 2000 ఇళ్లకు వెళ్లి తమ ప్రాణాలను పణంగా పెట్టి నిత్యవసర సరుకులను అందజేశారని చెప్పారు. తమ డిమాండ్లను తక్షణమే పరిష్కరించే దిశగా ప్రభుత్వం చొరవ తీసుకోవాలన్నారు. ఒక్కో ఆపరేటర్‌కు గదా రెండు సంవత్సరాల కాలంగా రావలసిన అంగనవాడి మిడ్ డే మీల్స్ అమౌంట్ని వెంటనే రిలీజ్ చేయాలని, 9,500 పై చిలుకు కట్టిన ఇన్సూరెన్స్ అమౌంట్ రావల్సి ఉందని ఆ బకాయిలను తక్షణమే చెల్లించాలన్నారు. అలాగే బ్యాంకుల ద్వారా 1,90,000 రూపాయలు బకాయిలు ఈఎంఐల ద్వారా చెల్లించాల్సి ఉందని వాటిని ప్రభుత్వమే చెల్లించాలని చెప్పారు. తమను తప్పనిసరిగా తొలగించాల్సి వస్తే కార్మిక చట్టం ప్రకారం ఆరు నెలల జీతాలను ముందే చెల్లించాలని డిమాండ్ చేశారు. రాజకీయ కక్షలతో బడుగు బలహీన వర్గాలకు ఇచ్చిన ఈ వెహికల్స్ ద్వారా జీవనోపాధి సాగిస్తున్న మాపై కక్ష సాధింపు తగదన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించకుంటే 26 జిల్లాల్లోని కలెక్టరేట్ల వద్ద ధర్నా నిర్వహిస్తామని, కుటుంబాలతో సహా కలెక్టరేట్లను ముట్టడి చేస్తామన్నారు. కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లా ఎండియు ప్రతినిధులు హేమసుందర్, వరహా నరసింహులు, వెంకట్రావు, అప్పలనాయుడు, రవి, వాసు, గోపి, రామారావు, కిట్టు, శ్రీను, మాధవ్, దివాకర్, కిషోర్, వరుణ్, కిరణ్, గోవిందరాజు, అనిల్, గణేష్, శంకర్, భాస్కర్ జిల్లా నలుమూలల నుండి ఎండియు ఆపరేటర్ తదితరులు పాల్గొన్నారు.



## నూతన విమాన సర్వీసులకు శ్రీకారం

(సత్యంన్యూస్, న్యూఢిల్లీ)

జూలై 2వ తేదీ నుండి విజయవాడ – కర్నూలు – విజయవాడ మధ్య నూతన ఇండిగో విమాన సర్వీసులు ప్రారంభించనున్నట్లు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి సోమవారం, బుధవారం, శుక్రవారం ఈ విమానాలు నడపబోతున్నట్లు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అమరావతిని రాయలసీమ ముఖ ద్వారమైన కర్నూలును అనుసంధానం చేస్తూ ఈ కొత్త మార్గం ఆంధ్రప్రదేశ్‌లోని ప్రాంతీయ ప్రయాణ అవసరాలను తీర్చడమే కాకుండా, అంతర్ రాష్ట్ర విమాన కనెక్టివిటీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా రూపొందించబడినది, రాష్ట్ర ప్రజలకు విమాన ప్రయాణాన్ని మరింత అందుబాటులోకి తీసుకు రావడమే తమ ప్రధాన లక్ష్యం అని వారు పేర్కొన్నారు. విద్య, వ్యాపారం, ప్రభుత్వ మరియు ఇతర అవసరాల నిమిత్తం ప్రాంతీయంగా ప్రయాణించే ప్రయాణికులకు ఇది ఎంతో ఉపయోగకరంగా మారుతుందన్నారు.



## ఉన్నత పాఠశాల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే



(సత్యంన్యూస్, పాతపట్నం)

నియోజకవర్గ పరిధిలో గల హిరమండలం మండలంలో గల సుబలయ్ ఆర్ అండ్ ఆర్ కోరాడ కొలని మండల పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలగా స్థాయిని పెంచిన సందర్భంగా ఎమ్మెల్యే మామిడి గోవిందరావు పాల్గొని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ విద్యారంగంలో ఎన్నో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొస్తున్న విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చొరవతో ఈ అప్‌గ్రేడేషన్ జరిగిందన్నారు. దూరంలో వున్న విద్యార్థులందరు ఒకే దగ్గర 10 వ తరగతి వరకు విద్యనభ్యసించే విధానాన్ని అమలు పరుస్తున్నామన్నారు. విద్యార్థులందరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని బాగా చదువుకొని ఉన్నతంగా రాణించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డి.ఈ.ఓ తిరుమల చైతన్య, యం.ఈ.ఓ రాంబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు కూటమి నాయకులు, గ్రామ నాయుకులు తదుతరులు పాల్గొన్నారు.

## ఎండీయూ రద్దుతో పేదలకు ఇక్కట్లు

(సత్యంన్యూస్, పాతపట్నం)



కూటమి ప్రభుత్వం ఇంటింటికి రేషన్ పంపిణీ పథకాన్ని రద్దు చేయడం ద్వారా నిరుపేదల నోటి వద్ద కూడు లాగేసిందని వైకాపా రాష్ట్ర క్రమశిక్షణా కమిటీ సభ్యురాలు, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రారంభించిన ఇంటింటికి నాణ్యమైన బియ్యం పంపిణీ పథకం పేదలకు ఆహార భద్రత కల్పించడంలో ఒక మంచి ముందడుగు అని ఆమె అన్నారు. ఈ పథకం ద్వారా లబ్ధిదారులు తమ ఇంటి వద్దకే నాణ్యమైన బియ్యాన్ని పొందడం, మధ్యవర్తుల ప్రమేయాన్ని తగ్గించడం వంటి ప్రయోజనాలు పొందారని ఆమె గుర్తు చేశారు. జగనన్న ముఖ్యంగా రేషన్ దుకాణాల వద్ద జరిగే అక్రమాలను, అవినీతిని అరికట్టేసి, మధ్యవర్తుల ప్రమేయాన్ని తగ్గించి, లబ్ధిదారులకు నేరుగా సరుకులు అందేలా చూశారన్నారు. అంతేకాకుండా, లబ్ధిదారులకు నాణ్యమైన బియ్యం, ఇతర నిత్యావసర సరుకులను అందించడం, వృద్ధులు, వికలాంగులు, ఇతరులు రేషన్ దుకాణాలకు వెళ్లే శ్రమను తగ్గించి, ఇంటి వద్దకే సరుకులు అందించడం ద్వారా వారికి సౌలభ్యం కల్పించడం, ప్రతి నెలా సకాలంలో రేషన్ సరుకులు లబ్ధిదారులకు చేరేలా చూడటం వంటి మంచి పనులను చేశారని వివరించారు. “పేదవారికి గౌరవం ఇవ్వాలని, పెత్తందారితనం నుంచి దూరం చేయాలని జగనన్న సంకల్పిస్తే, మీ కూటమి ప్రభుత్వం పాలనలో ఇప్పుడు మళ్ళీ రేషన్ డీలర్ ఇంటికి వెళ్లి తీసుకోవడం అంటే పెత్తందారితనాన్ని మీరు పెంచుతున్నారు. ఇది చాలా అన్యాయం, ఘోరం. కూటమి ప్రభుత్వం ప్రజలకు మోసం చేస్తున్నారు. ప్రజల నమ్మకానికి పూర్తిగా వెన్నుపోటు పొడిచారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. జగనన్న ఎంతో చక్కనైన నాణ్యమైన బియ్యం ఇంటింటికి పంపిణీ చేస్తే, ఈ కార్యక్రమం కేవలం జగనన్న కీర్తి ప్రతిష్టలు ఇంకా జనాల్లో మరింత ఉన్నాయని తెలిసి పూర్తిగా నిర్వీర్యం చేశారని ఆమె ఆరోపించారు. ఈ పథకాన్ని నిలిపివేయడం లేదా నిర్వీర్యం చేయడం అనేది పేదల సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేయడమే అని ఆమె పునరుద్ఘాటించారు. ఆహార భద్రత అనేది ప్రాథమిక అవసరం అని, దీనిని అడ్డుకోవడం సమంజసం కాదన్నారు. ఇంటి వద్దకే బియ్యం అందడం వల్ల వృద్ధులు, వికలాంగులు, అనారోగ్యంతో ఉన్న వారు, రవాణా సౌకర్యాలు లేని వారికి ఎంతో సౌకర్యంగా ఉండేదని ఆమె గుర్తు చేశారు. ఈ పథకం నిలిపివేయడం వల్ల వీరంతా మళ్ళీ రేషన్ షాపులకు వెళ్లి బియ్యం తెచ్చుకోవాల్సి వస్తుందని, ఇది వారికి అదనపు భారం మరియు అసౌకర్యం అని ఆమె వివరించారు. రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగా వైకాపా ప్రభుత్వం చేపట్టిన మంచి పనులను కూడా నిలిపివేయడం ఎంతవరకు సమంజసమని ఈ సందర్భంగా రెడ్డి శాంతి ప్రశ్నించారు.

## ఆమదాలవలస పట్టణంలో ఘనంగా మినీ మహానాడు

(సత్యంన్యూస్, ఆమదాలవలస)

నియోజకవర్గ పరిధిలో గల ఆమదాలవలస పట్టణంలో మినీ మహానాడు బుధవారం ఘనంగా ముగిసింది. కార్యక్రమంలో కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ తెలుగువాడి ఆత్మగౌరవానికి ప్రతీకగా పుట్టిన పార్టీ, పేద ప్రజల అభ్యున్నతి కోసం అహర్నిశలు శ్రమించే పార్టీ, బడుగు బలహీన వర్గాల కోసం ప్రతి క్షణం తపించే గొప్ప పార్టీ తెలుగుదేశం పార్టీ మాత్రమేనన్నారు. అనంతరం స్వర్గీయ ఎన్టీఆర్‌కు సంబంధించిన శ్రీనందమూరి శతకం పుస్తకాన్ని ఎమ్మెల్యే, పీయూసీ రాష్ట్ర చైర్మన్ కూన రవికుమార్‌తో కలిసి ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే కూన రవికుమార్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ గొప్ప సంప్రదాయంలో భాగమైన మహా నాడు నిర్వహించే ముందుగా మినీ మహానాడు ప్రతి ఏటా ఘనంగా నిర్వహిస్తున్నామని తెలియజేశారు తెలుగుదేశం పార్టీ యొక్క లక్ష్యాలను, ఆదర్శాలను ప్రజల్లోకి మరింత ఉత్తేజంతో తీసుకెళ్లేందుకు మహానాడు, మినీ మహానాడు ఒక ముఖ్యమైన వేదికగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో తెదేపాలో రాష్ట్రస్థాయిపదవులు అలంకరించిన నియోజవర్గానికి సంబంధించిన ముఖ్య నాయకులను సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పీరికట్ల విశ్వప్రసాద్, డీసీసీబీ చైర్మన్ శివ్వాల సూర్యం, మార్క్ఫెడ్ స్టేట్ డైరెక్టర్ అనేపు రామకృష్ణ, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్, స్టేట్ అబ్జర్వర్ టి.చంద్రశేఖరయాదవ్, నారాయణపురం ప్రాజెక్ట్ చైర్మన్ సనపల ఢిల్లీ, మండల అధ్యక్షులు నూకరాజు, ఎక్స్ చైర్‌పర్సన్ గీత విద్యాసాగర్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మొదలవలస రమేష్, మున్సిపాలిటీ టిడిపి అధ్యక్షులు సంపదరావు మురళి, జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు నందివాడ గోవిందరావు, బూర్జ మండల అధ్యక్షుడు రాంజీ, సరుబుజ్జిలి మండల అధ్యక్షుడు అంబాల్ల రాంబాబు, పొందూరు మండల అధ్యక్షుడు చిగిలిపల్లి రామ్మోహన్, తెలుగు జిల్లా మహిళ అధ్యక్షురాలు తమ్మినేని సుజాత, జిల్లా, నియోజకవర్గ పరిధిలో అన్ని హోదాల్లో ఉన్న ముఖ్య నాయకులందరూ పాల్గొన్నారు.



## మే 21 నుండి జూన్ 21 వరకు యోగాంధ్రా

**- జూన్ 21న ప్రపంచ యోగా దినోత్సవం**
**- గ్రామ స్థాయి నుండే పెద్ద ఎత్తున యోగాలో పాల్గొనాలి**
**- జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పిలుపు**



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

గ్రామస్థాయి నుండి పెద్దఎత్తున యోగాలో పాల్గొనాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పిలుపునిచ్చారు. జూన్ 21వ తేదీన ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడి విశాఖపట్నం రానున్నారు. బుధవారం అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి వారి దేవాలయంలో కర్టనరైజర్ యోగా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో పెద్ద ఎత్తున నిర్వహించ తలపెట్టిన యోగా కార్యక్రమం విజయవంతం అయ్యేదిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. మే 21 నుండి జూన్ 21 వరకు యోగాంధ్రా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. యోగాంధ్రా కార్యక్రమాలు గ్రామ స్థాయి నుండి జరుగుతాయని, ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బుధవారం అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి దేవస్థానం వద్ద యోగాంధ్రా కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. రథసప్తమి వేడుకలను కర్టనరైజర్‌గా దేవస్థానం నుండి ప్రారంభించిన వేడుకలు విజయవంతం అయినట్లు వివరించారు. యోగాంధ్రా కార్యక్రమం కూడా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నేటి నుండి 21 జూన్ వరకు గ్రామ, మండలం, మున్సిపాలిటీలలో జరుతుంటాయని, వీరికి ఒక యోగా టీచర్ శిక్షణ ఇస్తారన్నారు. ప్రతీఒక్కరూ యోగాపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. క్విట్ ఇండియా, క్విట్ ఆంధ్ర ఉద్యమంలా యోగాను తీసుకువెళ్లాలన్నారు. ప్రతీ ఒక్కరూ యోగాంధ్రా వెబ్ సైట్ లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ట్రేలర్ ఈ వారం రోజులు జిల్లా స్థాయిలో, వచ్చే వారం రోజులుగా మండల స్థాయిలో, మూడవ వారం గ్రామ స్థాయిలో ఉంటుందన్నారు. యోగా పై డిబేట్, వ్యాసరచన, తదితర పోటీలు ఉంటాయన్నారు. పర్యాటక ప్రాంతాలు, బీచ్‌లో యోగా కార్యక్రమం ఏర్పాటుకు ఆలోచన చేస్తున్నట్లు చెప్పారు. అందరూ కుటుంబాలతో యోగాలో పాల్గొనాలన్నారు. నేటి నుండి నెలరోజుల పాటు యోగా కార్యక్రమాలు ఉంటాయన్నారు. యోగాపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఎపిలో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించ తలపెట్టిన కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని శ్రీకాకుళం శాసనసభ్యులు గొండు శంకర్ పిలుపునిచ్చారు. యోగాంధ్ర కార్యక్రమాలు గ్రామ స్థాయి నుండి నిర్వహిస్తామన్నారు. అరసవల్లి ఉత్సవాలు కర్టనరైజర్ అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారి దేవస్థానం నుండి ప్రారంభించి విజయవంతం చేసినట్లు చెప్పారు. యోగాంధ్ర ను ఇక్కడ నుండే ప్రారంభిస్తున్నామన్నారు. ప్రజలంతా పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. యోగా కార్యక్రమంలో పాల్గొనదలచిన వారు ఆన్‌లైన్‌లో తమ పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ యోగా కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, ఆర్డీఓ కె.సాయి ప్రత్యూష, మున్సిపల్ కమిషనర్ పివివిడి ప్రసాదరావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ అనిత, యోగా టీచర్లు పొంద్రంకి మురళి కృష్ణ, తంగి స్వాతి, ఎ.గాయత్రి, రామారావు, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఐఐఐటీకి 48,988 దరఖాస్తులు

(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)




రాజీవ్ గాంధి యునివర్సిటీలో ఆరేళ్ళ సమీకృత ఇంజనీరింగ్ చదువు చదివే అవకాశం రెసిడెన్సియల్ విధా నంలో విద్య మంచి ఉన్నతమైన ఉద్యోగాలు సాధిస్తున్న విద్యార్థులు ఆహ్లాదకరమైన వాతావరణం గ్రామీణ ప్రాంతాల యువత ఎక్కువమందికి ప్రవేశాలు లభిస్తున్నాయి. ఐఐఐటి ప్రమాణాలతో కూడిన విద్యను అందిస్తున్నామని చెప్పారు. నిన్నటికి అప్లికేషన్ గడువు ముగిసిందని, డైరెక్టర్ బాలాజీ, పరిపాలనా అధికారి ముని రామకృష్ణ, డీన్ శివరామ కృష్ణ, ఫైనాన్స్ ఆఫీసరు వాసు, వెల్ఫేర్ డీన్ డాక్టర్ గేదెల రవి, అధికారులు, ఉపాధ్యాయులు ఉన్నారు.




వేసవి శిబిరంలో భాగంగా పాలకొండ శాఖా గ్రంథాలయం 26వ రోజు పిల్లలకు వేసవి ఎండలో తిరగడం వలన వడదెబ్బ నుంచి, వర్షం పడినప్పుడు పిడుగుల నుండి మనకు మనం ఎలా రక్షించుకోవాలో సచివాలయం అడ్మిన్ కె.శివకుమార్ వివరించారు. ఇన్‌చార్జి గ్రంథాలయ అధికారి బబ్బురు గణేష్‌బాబు, సహాయకుడు ఈశ్వర్ పాల్గొన్నారు.

**- సత్యంన్యూస్, శ్రీకాకుళం**



విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు బుధవారం తెప్పలవలస పంచాయితీ పరిధిలో పలు కార్యక్రమాలకు నాయకులు, కార్యకర్తలతో కలసి హాజరయ్యారు. పంచాయతీ పరిధిలో గల కొన్నిరకాల మౌలిక సదుపాయాల సమస్యలు పరిష్కారానికి సంభందించిన అధికారులతో మాట్లాడారు. ఆయనతోపాటు మాజీ సర్పంచ్ నాగేశ్వరావు, కొండలరావు, లంకా సీతారాములు, కొయ్య రామారావు తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **- సత్యంన్యూస్, రణస్థలం**

## గ్రంథాలయంలో డ్రాయింగ్ పోటీలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

బలగ హడ్కో కాలనీలో గల శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా బుధవారం గ్రంథాలయ అధికారి పి.ఉగ్రసేను ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా పిల్లలకు మెడిటేషన్ నీతి కథలు చెప్పి తదుపరి డ్రాయింగ్ పోటీ నిర్వహించారు. ఈ పోటీలో 39 మంది పిల్లలు సహాయకురాలు కె. అనిత తదితరులు పాల్గొన్నారు




డ్రైవర్లు కావలెను
సాయిప్రియ ట్రావెల్స్
శ్రీకాకుళంలో పని చేయుటకు
డ్రైవర్లు కావలెను
కనీసం 2 నుండి 3 సంవత్సరాల అనుభవం కావలెను.
CONTACT:
9440001447, 8341163666

ఎం.ఇర్షాద్
USHA
ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నిచర్..
అన్ని రకాల సెవింగ్ మిషిన్లు, ఫేషన్ మేకర్స్, ఎంబ్రాయిడరీ మిషిన్లు, స్పేర్స్ హోల్‌సేల్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రొ॥ వాళ్ళ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

SAI OPTICIANS
సరస్వతి మహల్ ఎదురుగా, శ్రీకాకుళం
ప్రొప్రయిటర్: బి.రమణమూర్తి
సెల్: 94407 59739
బ్రాంచ్ ఆఫీస్: గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, శ్రీకాకుళం, సెల్: 94407 59739

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
NEAR SURYA MAHAL THEATRE WOMEN'S COLLEGE ROAD, SRIKAKULAM - 532 001

# నమ్మిన తుపాకీ తూటాకే.. నేలకూలిన నంబాల

(మొదటిపేజీ తరువాయి)

వేణుగోపాల్, మల్లా రాజిరెడ్డిలతో కలిసి 1987లో బస్తర్ అడవుల్లో శ్రీలంక తమిళ తీవ్రవాద గ్రూపు అయిన ఎల్‌టీటీఈ నిపుణుల ద్వారా ఆకస్మిక దాడులు, పేలుడు పదార్థాల ప్రయోగంలో శిక్షణ పొందారు. ముప్పాళ్ల గణపతి అనంతరం 2018 నవంబరులో నంబాల కేశవరావు సీపీఐ మావోయిస్టు పార్టీ రెండో ప్రధాన కార్యదర్శిగా, సుప్రీం కమాండర్‌గారా నియమితులయ్యారు.

### అన్ని దాడుల్లోనూ ఆయన పాత్ర

ఛత్తీస్‌గఢ్, మహరాష్ట్ర, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో జరిగిన దాదాపు అన్ని నక్సలైట్ దాడుల వెనుక సూత్రధారి గానో, పాత్రధారిగానో నంబాల కేశవరావు పాత్ర ఉంది.

- 2003లో తిరుపతిలోని అలిపిరి వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుపై జరిగిన క్లైమోర్ మైన్ దాడి సూత్రధారి కేశవరావే. ఆ దాడిలో చంద్రబాబు తృటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు.
- 2018లో విశాఖ జిల్ల అరకు ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే సివేరి సోమాలపై దాడి చేసి హతమార్చిన ఘటనలోనూ ఆయనే కీలకవ్యక్తి అని పోలీసులు చెబుతున్నారు.
- 2010లో దంతేవాడలో మావోయిస్టు దళాలు జరిపిన దాడిలో 76 మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లు మరణించారు.
- అదే ఏడాది జీరామ్ ఘాటీలో జరిపిన దాడిలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర మాజీ మంత్రి మహేంద్ర కర్మ, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు నందకుమార్ సహా 27 మంది మృతి చెందారు.

### తలపై కోటిన్నర రివార్డు

తొలుత పీపుల్స్‌వార్, ఆ తర్వాత సీపీఐ మావోయిస్టు పార్టీలో అత్యున్నత పదవులు చేపట్టి.. సాయుధ భద్రతా బలగాలపై అనేక దాడులు చేసిన కేశవరావు తన జీవితంలో ఒక్కసారి మాత్రమే అరెస్టయ్యారు. 1980లో రాడికల్ స్టూడెంట్స్ యూనియన్ (ఆర్ఎస్‌యూ), అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) సంఘాల మధ్య శ్రీకాకుళంలో ఘర్షణ జరిగినప్పుడు కేశవరావును పోలీసులు అరెస్టు చేశారు. అయితే విప్లవోద్యమంలోకి వెళ్లిన తర్వాత మాత్రం ఒక్కసారి కూడా పోలీసులకు చిక్కలేదు. అందువల్లే ఎన్నో కేసుల్లో నిందితుడిగా ఉన్న కేశవరావు తలకు ప్రభుత్వాలు వెలకట్టాయి. మొదటి రూ.10 లక్షలతో మొదలై క్రమంగా పెరుగుతూ ఆ రివార్డు ప్రస్తుత రూ.కోటిన్నరకు చేరింది. చివరికి ఎదురు కాల్పుల్లో సాయుధ బలగాల తూటాలకు బలై కేశవరావు నేలకూలారు.



## ఛత్తీస్‌గఢ్‌లో ఎదురుకాల్పులు..

# 28 మంది మావోయిస్టుల మృతి

**చర్ల:** ఛత్తీస్‌గఢ్‌లో మరోసారి భారీ ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది. నారాయణపూర్ జిల్లాలో భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఘటనలో 28 మంది మావోయిస్టులు మృతిచెందినట్లు సమాచారం. మరి కొంత మందికి గాయాలైనట్లు తెలుస్తోంది. మాఢ్ ప్రాంతంలో పెద్దఎత్తున మావోయిస్టులు ఉన్నట్లు సమాచారం రావడంతో భద్రతా బలగాలు ఆపరేషన్ చేపట్టాయి. ఈ ఆపరేషన్‌లో బీజాపూర్, నారాయణపూర్, దంతెవాడ డీఆర్జీ బలగాలు పాల్గొన్నాయి. బుధవారం ఉదయం నుంచి భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య ఎదురుకాల్పులు కొనసాగుతున్నాయి.

### మృతుల్లో మావోయిస్టు అగ్రనేత!

అబుజ్మడ్‌లోని బటైల్ అడవుల్లో ఈ ఎదురుకాల్పులు జరుగుతున్నాయి. అక్కడ మావోయిస్టు అగ్ర నాయకుల బృందం ఉన్నట్లు సమాచారం. మావోయిస్టు అగ్రనేత నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు ఈ ఎన్‌కౌంటర్‌లో మృతి చెందినట్లు సమాచారం. అతడిపై రూ.కోటిన్నర రివార్డు ఉందని పోలీసులు పేర్కొంటున్నారు. బస్తర్‌లోని నాలు జిల్లాల నుంచి ఉమ్మడి భద్రతా దళాలు ఈ ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్నాయి. అబుజ్మడ్ ఎన్‌కౌంటర్‌ను నారాయణపూర్ ఎస్పీ ప్రభాత్ కుమార్ ధ్రువీకరించారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

### పోలీసు సహాయకుడు మృతి..

ఈ ఎదురు కాల్పుల్లో పోలీసు సహాయకుడు ఒకరు మృతి చెందినట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనలో గాయపడిన జవానుకు ప్రాణాపాయం లేదని ఛత్తీస్‌గఢ్ హెూంమంత్రి వెల్లడించారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఇటీవల ఛత్తీస్‌గఢ్–తెలంగాణ సరిహద్దుల్లోని కరేగుట్ట పర్వతాల్లో 24 రోజులపాటు జరిగిన ఆపరేషన్‌లో భద్రతా బలగాలు 31 మంది మావోయిస్టులను హతమార్చిన విషయం తెలిసిందే వీరిలో 16 మంది మహిళలు ఉన్నారు.

## వేసవి శిక్షణ శిబిరం..

# నూతనోత్తేజం

- గ్రంథాలయాలను వినియోగించుకుంటున్న విద్యార్థులు
- వివిధ అంశాలపై పూర్తిస్థాయి శిక్షణ

**ఆధునిక పరిజ్ఞానం ఎంత పెరిగినా... ఒక క్లిక్‌తో ప్రపంచ పరిజ్ఞానాన్ని తెలుసుకునేందుకు వీలున్నా.. గ్రంథాలయాలకు ప్రాధాన్యత తగ్గలేదు. పుస్తక పఠనం ఆలోచన శక్తికి పదును పెడుతుంది. విజ్ఞానాన్ని పెంపొందిస్తుంది. పుస్తకం మనసును మెప్పించే మిత్రుడుగా చెప్పుకోవచ్చు.**



సత్యంన్యూస్, లావేరు

ప్రస్తుతం వేసవి సెలవుల్లో పిల్లలకు గ్రంథాలయాల్లో శిక్షణా శిబిరాలు నిర్వహిస్తున్నారు. లావేరు శాఖా గ్రంథాలయంలో గత నెల 24 నుంచి గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు పర్యవేక్షణలో ప్రతీరోజు 70 మంది విద్యార్థులకు వివిధ అంశాలపై శిక్షణ ఇస్తున్నారు. శిబిరంలో ప్రార్థన, ధ్యానంతో మొదలై స్పోకెన్ ఇంగ్లీష్, చిత్రలేఖనం, నృత్యము, యోగా, పద్యాలు వల్లివేయడంతో పాటు అన్ని సబ్జెక్టులపై అనుభవజ్ఞులతో శిక్షణ ఇప్పిస్తున్నారు. చిన్నారుల్లో విజ్ఞానం పెంపొందించేందుకు రిసోర్స్‌పర్సన్ కృషి చేస్తున్నారు. ఈ శిబిరాల నిర్వహనపై విద్యార్థులు, తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులు సెలవులు వృథా చేయకుండా గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. విద్యార్థుల్లో ఆలోచన, సృజనాత్మక పెంపొందించడం, మేధావులతో బోధన, చదివిన విషయాలపై సమీక్ష, విజేతలకు బహుమతులు అందజేయడం వంటి కార్యక్రమాలు చేపడుతున్నారు.

### చాలా విషయాలు నేర్చుకుంటున్నాను



స్పోకెన్ ఇంగ్లీష్, కథలు చదవడం, కథలు చెప్పడం నేర్చుకుంటున్నానని కాకినాడ జిల్లా మల్లేపల్లి గ్రామానికి చెందిన ఆరవెల్లి శ్రీనిధి అన్నారు. వేసవి సెలవులకు ఇక్కడికి వచ్చానని, ఇక్కడ నేర్చుకున్న విషయాలను ఇంటి వద్ద కూడా తాను ప్రాక్టీస్ చేస్తున్నానని, దీనివల్ల ఇంగ్లీషులో పట్టు సాధించే అవకాశం ఉంటుందన్నారు.

### శిక్షణ ఉపయోగపడుతుంది

వేసవి శిక్షణ శిబిరంలో కంప్యూటర్ నేర్చుకుంటున్నానని, అలాగే డ్రాయింగ్, పెయింటింగ్‌పై శిక్షణ ఇస్తున్నారని, అన్ని పత్రికలు పుస్తకాలు చదువుతున్నానని, విజయనగరం జిల్లా గర్భం గ్రామానికి చెందిన ఆరవెల్లి అభిరామ్ సిద్ధార్థ్ అన్నారు. కథలు ఎలా రాయాలో తెలుసుకుంటున్నానని, చక్కటి నీతి కథలు వింటున్నామని, శిక్షణా కార్యక్రమం ఎంతో సరదాగా గడిచిపోతుందన్నారు.



### అన్ని అంశాలపై శిక్షణ



వేసవి శిక్షణ శిబిరాన్ని విద్యార్థులు పూర్తి స్థాయిలో వినియోగించు కుంటున్నారని గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు అన్నారు. గత నెల 28 నుంచి ఈ శిక్షణ శిబిరాలు జరుగుతున్నాయని, విద్యార్థులకు పుస్తక పఠనం, స్పోకెన్ ఇంగ్లీష్, చిత్రలేఖనం తదితర అంశాలపై శిక్షణ ఇస్తున్నామని విద్యార్థులలో దాగివున్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ఈ శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.

## జూన్ 8 నుంచి శ్రీ శంకర విజయం

# ప్రవచనాలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



జగద్గురు ఆదిశంకరాచార్యుల జీవిత విశేషాల సమాహారం అయిన 'శ్రీ శంకర విజయం' ఉద్ గ్రంధముపై మైసూర్‌కు చెందిన బ్రహ్మశ్రీ సంతోష్ కుమార్ ఘనపాఠి ఉపన్యాసాలు, ప్రవచనాలు ఐదు రోజుల పాటు నిర్వహిస్తున్నట్టు వాశిష్ఠ కార్తికేయ శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీశ్రీ జగద్గురు శంకరాచార్య మహాప్రస్థానం, శృంగేరి దక్షిణామూర్తి శ్రీ శారదా పీఠం పీఠాధిపతి జగద్గురు శంకరాచార్య శ్రీశ్రీశ్రీ భారతీ తీర్థ మహా సన్నిధానం, శ్రీశ్రీశ్రీ విధుశేఖర భారతి సన్నిధానం ఆశీస్సులతో జూన్ 8 నుంచి 12 వరకు ప్రతీరోజు సాయంత్రం 6.30 నుంచి 8.30 గంటల వరకు శ్రీకాకుళం పాలకొండ రోడ్డులోని బాపూజీ కళామందిరంలో తెలిపారు. శృంగేరి ఆధ్వర్యంలో అహం బ్రహ్మాస్మి సంస్థ నిర్వహణలో జరుగుతున్న ఈ కార్యక్రమంలో ఆస్తికులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని జగద్గురువుల జీవిత విశేషాలను తెలుసుకోవాలని కార్తికేయ శర్మ కోరారు.

# 60 శాతం దీపాలు వెలగడంలేదు



## వర్షాలు, సమ్మె కారణం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కేవలం నాలుగు మెయిన్ రోడ్లలో తప్ప వీధుల్లో 60 శాతానికి పైగా దీపాలు వెలగడంలేదు. ఇక విలీన పంచాయతీల కోసమైతే ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. నగర కార్పొరేషన్ పరిధిలో ఇంజినీరింగ్ విభాగంలో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది తమ డిమాండ్ల సాధన కోసం కొద్ది రోజులుగా సమ్మె చేస్తున్నారు. ఇందులో శతశాతం సమ్మెలో లేకపోయినా, బయట ఉన్న సిబ్బందితో దీపాలు వెలిగించడం కుదరడంలేదని తెలుస్తుంది. ఇటీవల వర్షాలు కురుస్తున్నందున ఆన్, ఆఫ్ బాక్స్‌ల్లో నీరు చేరిపోయింది. దీన్ని తొలగించి వీధి దీపాలు బాగుచేయడమంటే ఒకరిద్దరితో కుదిరే పని కాదు. దీంతో పూర్తిగా నిర్వహణను విడిచిపెట్టేశారు. ఒకవైపు వర్షాలకు బురదైన రోడ్లు, మరోవైపు నిండిపోయిన కాలువలకు తోడు ప్రతీ వీధిలోను కుక్కల బెడద విపరీతంగా ఉండటంతో చీకటిలో దేవులాడుకొని ఇంటికి చేరాల్సిన పరిస్థితి ఏర్పడింది.



శ్రీకాకుళంలో సిబ్బంది సమ్మె చేస్తున్నందున మిగిలిన శాఖల్లో ఉన్న, లేదా పక్క మున్సిపాలిటీల్లో ఉన్న ఎలక్ట్రికల్ సిబ్బందితోనైనా వీధిదీపాలు వెలిగించాలని ప్రజలు కోరుతున్నారు.

## ఏపీఆర్‌డీసీ సెట్‌లో పద్మావతి విద్యార్థుల హవా



ఆవల భవాని ప్రసాద్



వి.సాయికుమార్

(సత్యంన్యూస్, నరసన్నపేట)

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గురుకుల డిగ్రీ కళాశాలల్లో ప్రవేశానికి రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన ఏపీఆర్‌డీసీ సెట్‌లో స్థానిక పద్మావతి జూనియర్ కళాశాల విద్యార్థులు తమ సత్తా చాటారు. ఆవల భవాని ప్రసాద్ రాష్ట్రస్థాయిలో నాలుగో ర్యాంక్ సాధించగా, వి.సాయి కుమార్ ఎనిమిదో ర్యాంక్ సాధించారని కళాశాల డైరక్టర్ సిహెచ్ దుర్గాప్రసాద్ తెలిపారు. కంప్యూటర్ సైన్స్ విభాగంలో ఈ ర్యాంకులు పొందిన విద్యార్థులను కళాశాల చైర్మన్ పల్లి సూరిబాబు, ప్రిన్సిపాల్ ఈఎం నాయుడు, అధ్యాపకులు అభినందించారు.

# గ్రంథాలయంలో చదరంగం



(సత్యంన్యూస్, లావేరు)

వేసవి శిక్షణ శిబిరాల్లో భాగంగా లావేరు శాఖ గ్రంథాలయంలో బుధవారం విద్యార్థులతో చదరంగం ఆడించారు. ఆరవెల్లి అభిరాం సిద్ధార్థ, నక్కిన హర్షవర్ధన్‌లు ఈ ఆటలో బహుమతులు గెలుచుకున్నారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు మాట్లాడుతూ చదరంగం అంతర్జాతీయ ఆట అని, భారత్ గ్రాండ్ మాస్టర్ విశ్వనాథన్ రష్యా గ్రాండ్ మాస్టర్ వి.డి.మాన్ 11వ మ్యాచ్‌ని డ్రాగా ముగించి మూడవసారి ప్రపంచ చదరంగ టైటిల్ కైవసం చేసుకున్నాడని తెలిపారు. ప్రతి విద్యార్థి చదరంగం ఆట నేర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు టి.వీరభద్రుడు, పాఠకులు పాల్గొన్నారు.








## 22న సంజీవరాయునికి

# అభిషేకాలు, ప్రత్యేక పూజలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

హనుమజ్జయంతిని పురస్కరించుకొని ఈ నెల 22న చినబొందిలీపురం బాయమ్మతోట సఖియామఠం వద్ద కొలువై ఉన్న ఆంజనేయ ఆలయంలో స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు ఆలయ ధర్మకర్త ఒక ప్రకటనలో తెలిపారు. విశ్వజయము గ్రూప్ భక్త బృందం సౌజన్యంతో నిర్వహించబోయే ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు. ఈ సందర్భంగా అభయ ప్రసన్నమారుతి అనే 108 పుస్తకాలతో అష్టోత్తర పుస్తకార్చన కూడా జరుగుతుందని పేర్కొన్నారు.

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.